RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 8-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 310 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
• పత్రికారంగంలో అసక్తి కలిగి ఉండాలి.
• తెలుగు భాషపై పట్టు ఉండాలి.
• రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
• స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
• సమాజ సేవ చేయగల ఉత్రహం ఉండాలి.
• అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386



## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం..

### ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం

యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు

పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల

2లో



## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్

డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన

లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ

డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్

### ఏపీ డీఎస్సీపై తమీమ్ అన్సారియా

## మరోసారి క్లారిటీ

డీఎస్సీపై వస్తున్న ఆరోపణలను ఖండించిన విద్యాశాఖ

హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే నియామకాలు జరిగాయని వెల్లడి

ఎంపికైన అభ్యర్థులు ఆందోళన చెందవద్దని స్పష్టీకరణ

అక్టోబర్‌లో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్.. డిసెంబర్‌లో పరీక్షలు

2లో



మెగా డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మరోసారి తీవ్రంగా ఖండించింది. ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు తావులేదని, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనలను పక్కాగా అమలు చేశామని స్పష్టం చేసింది. ఇదే సమయంలో నిరుద్యోగులకు తీపి కబురు

# యూపీఐపై ఛార్జీలుండవ్!

వినియోగదారులు, చిన్న వ్యాపారులకు ఊరట..

వినియోగదారులకు యూపీఐ చెల్లింపులు పూర్తిగా ఉచితం

చిన్న వ్యాపారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు

పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారిక ప్రకటన




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై ఛార్జీలు విధించవచ్చనే చర్చలకు పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) శుక్రవారం తెరదించింది. వినియోగదారులకు యూపీఐ చెల్లింపులు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని, చిన్న వ్యాపారుల నుంచి ఎటువంటి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేయబోమని శుక్రవారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2016లో ప్రారంభమైనప్పటి నుంచి యూపీఐ సేవలు వినియోగదారులకు ఉచితంగానే అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులోనూ



## రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల పెనాల్టీ..

అధికారుల తీరుపై మంత్రుల సీరియస్ వార్నింగ్.. అసలేం జరిగిందంటే..?


అధిక పెనాల్టీలపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం

రోడ్ల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఉన్నత స్థాయి సమీక్ష

కాంట్రాక్టర్ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశం

కాంట్రాక్టర్లను వేధిస్తే సహించేది లేదని అధికారులకు స్పష్టమైన హెచ్చరిక

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం..



రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు.

ప్రకటించిన సీఎం చంద్రబాబు

బీసీల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి

ఇప్పటికే చట్టం ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి

బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ

చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల

ఆర్థిక కష్టాలున్నా అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడబోమని చంద్రబాబు స్పష్టం




## తెలంగాణలో నిలిచిపోనున్న యాప్ ఆధారిత సేవలు..

నిరవధిక సమ్మెకు గిగ్ వర్కర్ల పిలుపు

ఓలా, ఉబర్, స్విగ్గీ, జొమాటో సహా పలు సంస్థల సేవలు బంద్

సంక్షేమ బోర్డు ఏర్పాటు, కనీస ఛార్జీల ఖరారు చేయాలని డిమాండ్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని జేఏసీ ఆరోపణ

రాష్ట్రవ్యాప్తంగా 16 సంఘాలతో నిరవధిక సమ్మెకు పిలుపు

2లో

## రేవంత్‌కు కేటీఆర్ లేఖ..

### నేతన్నల కోసం చేసిన కీలక డిమాండ్లు ..?

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్

చేనేత సంక్షేమ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శ

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు: రామచందర్ రావు

### తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు

**రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం**

**మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి**

**తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు.

## తెలంగాణలో నిలిచిపోనున్న యాప్ ఆధారిత సేవలు..

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణలో యాప్ ఆధారిత వాహన, ఫుడ్ డెలివరీ సేవలకు శనివారం నుంచి బ్రేక్ పడనుంది. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి క్యాబ్ సర్వీసులతో పాటు స్విగ్గీ, జొమాటో, జెప్టో వంటి ఫుడ్ డెలివరీ సేవలు రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోనున్నాయి. ఆగస్టు 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు గిగ్ వర్కర్ల 'జాయింట్ యాక్షన్ కమిటీ' (జేఏసీ) ప్రకటించింది. హైదరాబాద్ నాంపల్లిలోని గిగ్ ఆఫీసులో సమావేశమైన 16 సంఘాల ప్రతినిధులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన స్పందన లేకపోవడంతోనే సమ్మెకు దిగుతున్నట్లు జేఏసీ నేతలు స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్స్ రూల్స్‌ను అమలు చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. యాప్ ఆధారిత రవాణా సేవలకు కనీస ఛార్జీ, కిలోమీటర్‌కు, నిమిషానికి న్యాయపరమైన ఛార్జీలను నోటిఫై చేయాలని కోరుతున్నారు. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలకు అనుగుణంగా కనీస ఛార్జీలు నిర్ణయించి, డ్రైవర్లు, డెలివరీ సిబ్బందికి స్థిరమైన ఆదాయం లభించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమతో సమావేశమై పలు హామీలు ఇచ్చారని, వాటిని ఇంతవరకు నెరవేర్చలేదని జేఏసీ నేతలు గుర్తు చేస్తున్నారు. గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారని, కానీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ సంస్థలు అమలు చేస్తున్న అన్యాయమైన ఛార్జీల వల్ల తమ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని, అందుకే సమ్మె తప్ప మరో మార్గం లేదని వారు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయని, ప్రజలు తమకు సహకరించాలని వారు కోరుతున్నారు. ఈ సమ్మెతో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్రయాణికులు, ఫుడ్ డెలివరీ సేవలపై ఆధారపడిన వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం..

శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## రేవంత్‌కు కేటీఆర్ లేఖ..

'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి పథకాలను నిలిపివేయడం వల్ల వేలాది చేనేత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన బతుకమ్మ చీరలు, పాఠశాల యూనిఫారాల తయారీ ఆర్డర్లను ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అలాగే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన రూ.18 వేల వార్షిక ఆర్థిక సాయం, రూ.1 లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో చేనేత రంగం ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల నేతన్నల పరిస్థితి మరింత దెబ్బతిన్నదని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రద్దు చేసిన పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ కోరారు.

## రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల పెనాల్టీ..

హైదరాబాద్: రోడ్ల నిర్మాణ పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు భారీగా పెనాల్టీలు విధిస్తున్న తీరుపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ అంశంపై వారు అధికారులను నిలదీశారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం పూర్తిగా అన్యాయమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ఈ వ్యవహారంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఘటనకు బాధ్యులైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాల్సింది పోయి, ప్రభుత్వ రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని మంత్రులు స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ అనుమతుల పేరుతో ఎలాంటి వేధింపులు ఉండకూడదని, కాంట్రాక్టర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న హ్యామ్ (నాబీ) మోడల్ రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేసి, 2028 నాటికి తెలంగాణలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన రహదారులు నిర్మించడమే లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు అధికారులు పూర్తి సహకారం అందించాలని, నిర్లక్ష్యం లేదా అనవసర వేధింపులు సహించబోమని మంత్రులు హెచ్చరించారు.

## ఏపీ డీఎస్సీపై తమీమ్ అన్సారియా మరోసారి క్లారిటీ

అందిస్తూ, అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ ఎంపికపై ఇప్పటికే మూడుసార్లు వివరణ ఇచ్చినప్పటికీ, కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకే మరోసారి స్పష్టత ఇస్తున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, కేవలం అర్హులైన అభ్యర్థులకే పోస్టులు దక్కాయని ఆయన నొక్కిచెప్పారు. "డీఎస్సీ నిర్వహణలో 12 రకాల ప్రమాణాలను అనుసరించాం. ఎంపికైన వారి మెరిట్, సెలక్షన్ జాబితాలను ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా చూసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు, ప్రభుత్వం వారికి పూర్తి అండగా ఉంటుంది. ఎవరికైనా ఏవైనా అనుమానాలుంటే నేరుగా అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు," అని కమిషనర్ వివరించారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు వదంతులను నమ్మి నిరుత్సాహపడకుండా, రాబోయే డీఎస్సీపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అక్టోబర్‌లో కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని తమీమ్ అన్సారియా వెల్లడించారు.

## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

**సోషల్ మీడియాలో పోస్ట్ చూసి వృద్ధురాలిని పిలిపించుకుని ఫోటో దిగిన సీఎం**

**మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను కలిసిన చంద్రబాబు**

**శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన నాగేశ్వరరావు, లక్ష్మీలకు అభినందనలు**


ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని పలకరించడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు.

## యూపీఐపై ఛార్జీలుండవ్!




లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదన ఏదీ లేదని పీసీఐ తన పోస్టులో పేర్కొంది. భారతీయులందరూ ఎటువంటి అదనపు రుసుములు లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు కొనసాగించవచ్చని భరోసా ఇచ్చింది. అదేవిధంగా, చిన్న వ్యాపారులు సైతం యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించేందుకు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దాని సుస్థిరత, నిర్వహణ వ్యయాలపై కొంతకాలంగా విస్తృత చర్చ జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం, సైబర్ సెక్యూరిటీని పటిష్ఠం చేయడం, ఆర్థిక మోసాల నివారణ వంటి అంశాలకు అవసరమైన నిధులపై ఈ చర్చలు కేంద్రీకృతమయ్యాయి. ఈ క్రమంలోనే యూపీఐ ఛార్జీలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ పీసీఐ ఈ స్పష్టతనిచ్చింది. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐ సమన్వయంతో గత దశాబ్ద కాలంగా ఈ చెల్లింపుల వ్యవస్థను నిర్మించాయని గుర్తుచేసింది. భవిష్యత్తులో కొన్ని రకాల డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించేందుకు ప్రభుత్వానికి వీలు కల్పించేలా చట్టపరమైన మార్పులు జరిగినప్పటికీ, ప్రస్తుతానికి వినియోగదారులు మరియు చిన్న వ్యాపారులపై ఎటువంటి అదనపు భారం ఉండదని ఈ ప్రకటనతో స్పష్టమైంది.

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం..




శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్

డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.
2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి.



# టీబీపై ముందస్తు పోరాటం.. జగద్గిరిగుట్టలో ప్రత్యేక స్క్రీనింగ్

యూపీహెచ్‌సీ జగద్గిరిగుట్టలో టీబీ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహణ

కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో డా. ఆనంద్, డా. జ్యోతి

ప్రారంభ దశలోనే టీబీ గుర్తించి పూర్తి చికిత్స అందించాలని అధికారుల సూచన

**జగద్గిరిగుట్ట, ఆగస్టు 07 (నేటి ప్రస్థానం):** దేశాన్ని క్షయవ్యాధి (టీబీ) రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో జగద్గిరిగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రత్యేక టీబీ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. ఆనంద్, కూకట్‌పల్లి డివిజన్ డీఎంహెచ్‌వో డా. జ్యోతి సందర్శించి ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించారు. స్క్రీనింగ్ ప్రక్రియతో పాటు ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించిన అధికారులు వైద్య సిబ్బంది పనితీరును అభినందించారు. టీబీ అనుమానితులను ప్రారంభ దశలోనే గుర్తించి ప్రతి ఒక్కరికీ సమగ్రంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి చికిత్స అందించి, చికిత్స పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డా. ప్రేమామృత ఆధ్వర్యంలో ఎన్‌టీఈపీ సిబ్బంది, ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు టీబీ లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న చికిత్స సౌకర్యాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అధికారుల సందర్శన, మార్గదర్శకాలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపాయని, టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# మందుబాబులకు ఊహించని షాక్..

వైన్ షాపులు బంద్.. కారణమేంటంటే..?

ఆగస్టు 9న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలకు బ్రేక్

సైబరాబాద్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో ఆదేశాలు అమలు

ప్రజా శాంతి, భద్రత కోసమే నిర్ణయం.. స్టార్ హోటళ్ల బార్లకు మినహాయింపు




హైదరాబాద్, ఆగస్టు 07, (నేటి ప్రస్థానం): బోనాల పండుగ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా శాంతి, భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ఆగస్టు 9న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ ఆదేశాలు జారీ చేశారు. పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ ఉత్తర్వులు అమల్లోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ ఆదేశాలు కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు. రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లకూ ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అయితే స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలో నిర్వహిస్తున్న బార్లకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ రమేశ్ తెలిపారు. నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# రావల్కోల్‌లో అసైన్డ్ భూమి అన్యాక్రాంతం

99 ఏళ్ల లీజ్ పేరుతో షెడ్ల నిర్మాణం.. అధికారుల విచారణకు స్థానికుల డిమాండ్

పేద రైతుల జీవనోపాధి కోసం ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు క్రమంగా అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రావల్కోల్ గ్రామంలో అసైన్డ్ భూమిని కొందరు వ్యక్తులు లీజ్ ఒప్పందాల పేరుతో స్వాధీనం చేసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



**మేడ్చల్ (నేటి ప్రస్థానం):** స్థానికుల సమాచారం ప్రకారం, గ్రామంలోని సర్వే నంబర్--62లో ఒక రైతుకు ప్రభుత్వం ఎకరం 20 గుంటల అసైన్డ్ భూమిని కేటాయించింది. అయితే ఆ ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో కొందరు వ్యాపారులు రైతు నుంచి లక్షల రూపాయలకు భూమిని తీసుకుని, రిజిస్ట్రేషన్ సాధ్యం కాకపోవడంతో 99 సంవత్సరాల లీజ్ ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ భూమిలో షెడ్లు నిర్మించి వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు సాగు కోసం కేటాయించిన భూములు అసలు ఉద్దేశానికి భిన్నంగా ఉపయోగపడుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, అసైన్డ్ భూములను పరిరక్షిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# నేతన్నలకు భారీ భరోసా..

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రకటించిన కీలక నిర్ణయాలేంటి..?

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

'నేతన్న భరోసా' కింద ఏటా రూ.18 వేల సాయం.. రూ.5 లక్షల బీమా రక్షణ

ఆగస్టు 7 నుంచి 16 వరకు పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్‌తో ప్రత్యేక ప్రదర్శన

**హైదరాబాద్, ఆగస్టు 7:** చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి, 100కు పైగా చేనేత స్టాల్స్‌ను ప్రారంభించారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు నిర్వహించే చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను ప్రభుత్వం సత్కరిస్తుందని మంత్రి తెలిపారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ××ు ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కీలక పథకాలు అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 'నేతన్న భరోసా' పథకం కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం



అందిస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకం ద్వారా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. చేనేత రుణమాఫీ కోసం రూ.49.27 కోట్లు విడుదల చేయగా, రంగాభివృద్ధికి మొత్తం రూ.980 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3,096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా జరుగుతోందని, పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. రైతన్నతో పాటు నేతన్న సంక్షేమానికీ కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# నేడు శంకర్ పల్లి ఏఎంసీ యార్డులో వెలసిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవం...

**శంకర్ పల్లి: ఆగస్టు 07:** శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవ సందర్భంగా స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర ఆషాఢ బహుళ దశమి శనివారం 8వ తేదీన ఉదయం 9 గంటలకు అమ్మవారికి అభిషేకము, అలంకరణ తదుపరి మహా నైవేద్యం మంగళహారతి జరుగుతుందని నిర్వాహకులు, గ్రామ పెద్దలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. 9వ తేదీ ఆదివారం శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద బోనాల ఉత్సవాలు జరుగుతాయని ప్రకటనలో తెలిపారు.

# స్మార్ట్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి. సిఐటియు..

**పెదనందిపాడు ఆగస్టు 7:** స్మార్ట్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన యూనియన్ ఆధ్వర్యంలో పెదనందిపాడు ఎంఈఓ సిహెచ్. రమేష్ బాబుకు ఈ సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలనెలా బిల్లులు ఇవ్వని ప్రభుత్వంస్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటు వారికి అప్పజెప్పటం, వాటికి ముందుగానే పెట్టుబడి పెట్టడం ద్వారా కూటమి ప్రభుత్వం పి.పి.పి విధానాన్ని తేవడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా ఈ విధానాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల మధ్యాహ్నం భోజన పథకం లక్ష్యాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. స్మార్ట్ కిచెన్ విధానం వల్ల ఉద్యోగ భద్రత పోతుందని, విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పెరుగుతాయని, తక్షణం ఈ విధానాన్ని రద్దుచేసి, ఏజెన్సీల ద్వారానే నిర్వహించాలని కోరారు.




# కల్తీ ముఠాలకు ఇక కౌంట్‌డౌన్..

### రంగంలోకి 100 మంది పోలీసులతో ప్రత్యేక బృందం..!

### ఆహార కల్తీపై రాష్ట్రవ్యాప్తంగా కూంబింగ్ ఆపరేషన్

### 100 మంది పోలీసులతో ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్ ఏర్పాటు

### కల్తీదారులపై హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేస్తామని డీజీపీ హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 7: రాష్ట్రంలో పెరుగుతున్న ఆహార కల్తీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. కల్తీ ముఠాలపై రాష్ట్రవ్యాప్తంగా కూంబింగ్ నిర్వహించేందుకు 100 మంది పోలీసులతో ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన దాడుల్లో 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు, హానికర రసాయనాలు, ఫ్యాబ్రిక్ డైలు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హెచ్-ఫాస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే వందల కేసులు నమోదు చేసి భారీ మొత్తంలో కల్తీ పదార్థాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే బీఎన్ఎస్ సెక్షన్ 110 కింద హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేస్తామని డీజీపీ హెచ్చరించారు. త్వరలో 'టీ-సేఫ్' వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించి కల్తీపై ఉక్కుపాదం మోపనున్నట్లు తెలిపారు.

# బోనాల సంబరాలకు సంగీత హంగులు..

### ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రత్యేక పాటల సీడీ విడుదల

### పటాన్‌చెరు బోనాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరణ

### రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా పాటలు రూపొందించారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రశంస

**బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపు**




గుమ్మడిదల (పటాన్‌చెరు), ఆగస్టు 07 (నేటి ప్రస్థానం): పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 10న జరగనున్న మహంకాళి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక బోనాల పాటల సీడీని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించేలా పాటలను రూపొందించడం అభినందనీయమని ఆయన అన్నారు. బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పండుగ సందర్భంగా కళాకారులు, గాయకులు తమ ప్రతిభతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నారని కొనియాడారు. బోనాల పాటలను రూపొందించిన గాయకుడు వడ్ల నాగేష్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి, కళాకారులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, ఐలేష్ యాదవ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



### ఇక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు..

# ఇంటికే రానున్న పౌర సేవలు..!

### వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు: మంత్రి శ్రీధర్ బాబు

### త్వరలో అందుబాటులోకి డిజిటల్ అసెంబ్లీ, బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్లు

### టీ-ఫైబర్ ద్వారా 80 లక్షల గ్రామీణ కుటుంబాలకు డిజిటల్ కనెక్టివిటీ లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 07( నేటి ప్రస్థానం): ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ పాలనకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్" ను ప్రారంభించిన మంత్రి, త్వరలోనే వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ పౌర సేవలను నేరుగా ఇంటి ముంగిటకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, డిజిటల్



ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగాన్ని రాష్ట్ర పాలనలో విస్తృతంగా పెంచుతున్నామని చెప్పారు. త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌తో పాటు బ్లాక్‌చెయిన్ సాంకేతికత ఆధారంగా మోసాలకు తావులేని డిజిటల్ సర్టిఫికెట్ సేవలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. టీ-ఫైబర్ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు డిజిటల్ కనెక్టివిటీ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. అలాగే 'డిజిటల్ ఆఫీస్' ప్రాజెక్ట్‌తో పేపర్‌లెస్ పాలనను వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. 20కిపైగా ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే రియల్‌టైమ్ గవర్నమెంట్ డ్యాష్‌బోర్డ్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన ప్రముఖ అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొని డిజిటల్ పాలనపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

# ప్రభుత్వానికి నిరంజన్ రెడ్డి వార్నింగ్..

### 11వతేదీ తర్వాత ఏం జరుగుతుందంటే..?

### ఆగస్టు 11వతేదీలోపు ఎత్తిపోతల పంపులు ప్రారంభించాలని నిరంజన్ రెడ్డి డిమాండ్

### కేటీఆర్‌తో కలిసి నార్లాపూర్ ప్రాజెక్టు ముట్టడిస్తామని హెచ్చరిక

### కృష్ణా జలాల విషయంలో రైతులను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపణ

హైదరాబాద్, ఆగస్టు 07(నేటి ప్రస్థానం): జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల పంపులను వెంటనే ప్రారంభించి పాలమూరు రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీలోపు భీమా ఫేజ్-1, ఫేజ్-2, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ పరిధిలోని పంపులను ప్రారంభించకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి వేలాది మంది రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కృష్ణా నదిలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ రాష్ట్రంలో నీటి కొరత ఉందని



చెప్పడం రైతులను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రైతుల ప్రయోజనాలను విస్మరించి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల తరలింపులో సీఎం చంద్రబాబుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. కర్ణాటక నుంచి వచ్చే వరద జలాలతో డిసెంబర్ వరకు జూరాల ప్రాజెక్టులో తగినంత నీరు అందుబాటులో ఉంటుందని పేర్కొన్న ఆయన, ఆలస్యం చేయకుండా ఎత్తిపోతల పంపులను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులపై చైర్మన్ కుమార్ గౌడ్ ఫోకస్.. సీసీ రోడ్డు పనుల తనిఖీ

### 15వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్ కుమార్ గౌడ్

### సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోతే ఊరుకోం.. కాంట్రాక్టర్‌కు చైర్మన్ ఆదేశాలు

### ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే మున్సిపాలిటీ లక్ష్యమని వెల్లడి



గుమ్మడిదల, ఆగస్టు 07(నేటి ప్రస్థానం): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తికావాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఇందులో భాగంగా 15వ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను పరిశీలించిన చైర్మన్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకులు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోలక్‌పల్లిలో బోనాల జాతర వైభవం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..!

### సోలక్‌పల్లి బోనాల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని వ్యాఖ్య

**గుమ్మడిదల (జిన్నారం), ఆగస్టు 07 (నేటి ప్రస్థానం):** జిన్నారం మున్సిపల్ పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో బోనాల పండుగ, జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బోనాల జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయని అన్నారు. భక్తి, ఐకమత్యంతో ప్రజలు బోనాల పండుగను నిర్వహించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.





## సోలక్‌పల్లిలో ఘనంగా బోనాల పండుగ

### హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్

**జిన్నారం మున్సిపల్, :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో బోనాల పండుగ, గ్రామ జాతర వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ జిన్నారం మండల అధ్యక్షులు నాయి కోటి రాజేష్, ఆది రామకృష్ణ, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీజీ ఎంట్రన్స్ లో రెండవ ర్యాంక్ సాధించిన అంజన్న



**లక్షెటిపేట, ఆగస్టు 07, :** ఇటీవల కాకతీయ యూనివర్సిటీ నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కూన అంజన్న జూవాలజీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించినట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్ కు చెందిన కూన అంజన్నకు జూవాలజీ సబ్జెక్ట్ అంటే ఎంతో ఇష్టమని, జీవుల పుట్టుక, నిర్మాణం, పర్యావరణ విద్యపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండటమే కాకుండా ఏమైనా సబ్జెక్ట్స్ డౌట్స్ ఉంటే అడిగేవాడని డాక్టర్ చంద్ర శేఖర్ గుర్తు చేశారు. పట్టుదల, అంకిత భావంతో చదువుకుంటే యూనివర్సిటీ ర్యాంక్ లు సాధిస్తారని పేర్కొన్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో ఈ ర్యాంక్ రావడానికి కారణమైన అధ్యాపకులకు అంజన్న ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అనుమతులు లేని స్కాలర్ జూనియర్ కళాశాలను తక్షణమే మూసివేయాలి

### యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

**నర్సాపూర్, ఆగస్టు07-:** నర్సాపూర్ మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్కాలర్ జూనియర్ కళాశాలను తక్షణమే మూసివేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మెదక్ కలెక్టర్ కార్యాలయంలో డీఐఈఓ మాధవికి యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాటికొండ రవి మాట్లాడుతూ గత జూన్ నెల నుంచి కలెక్టర్‌తో పాటు డీఐఈఓకు ఐదుసార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనుమతులు లేకుండానే కళాశాలలో అడ్మిషన్లు తీసుకుంటూ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఒకే భవనంలో కింది అంతస్తులో పాఠశాలను నిర్వహిస్తూ, పై అంతస్తులో జూనియర్ కళాశాలను నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి కళాశాల నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తాటికొండ రవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.





# బీరంగూడలో భారీ అభివృద్ధి..

# రూ.8.55 కోట్ల పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

### బీరంగూడ డివిజన్‌లో రూ.8.55 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన

### రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలకు ప్రాధాన్యం

### నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం





**గుమ్మడిదల (అమీన్పూర్), ఆగస్టు 7 (నేటి ప్రస్థానం):** బీరంగూడ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ. 8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వేగంగా అభివృద్ధి చెందుతున్న కాలనీల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డీఈ వెంకటరమణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## విచారణలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి మౌనం..

### మళ్లీ కోర్టును ఆశ్రయించిన పోలీసులు

### విచారణకు సహకరించలేదంటూ ఉదయ్ కృష్ణారెడ్డిని మరోసారి కస్టడీకి కోరిన పోలీసులు

### ఉప్పర్‌పల్లి కోర్టులో తాజా పిటిషన్ దాఖలు

### శనివారం పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 07 (నేటి ప్రస్థానం) : మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసు విచారణలో సహకరించలేదని పోలీసులు పేర్కొన్నారు. రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసిన అనంతరం, మరింత లోతైన విచారణ కోసం మరోసారి కస్టడీ ఇవ్వాలని కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, కస్టడీ సమయంలో అడిగిన పలు కీలక ప్రశ్నలకు ఉదయ్ కృష్ణారెడ్డి సమాధానాలు ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలిపారు. దీంతో కేసుకు సంబంధించిన మరిన్ని అంశాలను వెలికితీయాలంటే అదనపు కస్టడీ అవసరమని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్‌పై శనివారం విచారణ జరిగే అవకాశం ఉంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడి చేశారనే ఆరోపణలతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. కోర్టు అనుమతితో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు కస్టడీలో విచారణ జరిపిన అనంతరం, సహకారం లభించలేదని పేర్కొంటూ పోలీసులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు.


## చుక్క నీటి కోసం ఎదురుచూపులు..

### అధికారులను ఆశ్రయించిన కాలనీవాసులు..!

### రాఘవేంద్ర నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

### త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఎంసీ హామీ

### ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని కాలనీవాసుల ఆవేదన



**మేడ్చల్, ఆగస్టు 07(నేటి ప్రస్థానం):** మేడ్చల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని పూడూర్--కిష్టాపూర్ డివిజన్ రాఘవేంద్ర నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మాధురికి వినతిపత్రం సమర్పించారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. కాలనీకి నాలుగు, ఐదు రోజులకోసారి కూడా సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని, దీంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని కాలనీవాసులు తెలిపారు. ట్యాంకర్ల ఖర్చు భరించడం కష్టంగా మారడంతో పాటు, అవసరమైన సమయంలో అవి కూడా అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఏఎంసీ మాధురి సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యపాల్ రెడ్డి, సహ కార్యదర్శి రాంప్రసాద్, కౌన్సిలర్ నిశితా రెడ్డి, సచిన్, కోట రమేష్, రాజి రెడ్డి, విజయ్, బస్వారాజ్, తదితరులు పాల్గొన్నారు.

